## సాంకేతిక పరిజ్ఞానంతో బోధనలో నైపుణ్యం

**నూజివీడు రూరల్** :సాంకేతిక పరిజ్ఞానంతో బోధనలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆర్‌జియుకెటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. ఆర్‌జియుకెటి నూజివీడు సిఎస్‌సి ఫ్యాకల్టీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్స్ టెక్నాలజీపై శిక్షణ తరగతులు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విసి మాట్లాడుతూ టెక్నాలజీని ఉపయోగించుకోవడం ద్వారా ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను మెరుగుపరచుకోవచ్చన్నారు. మంచి ఉపాధ్యాయుడు ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తారన్నారు. ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలు, జ్ఞానాన్ని మెరుగుపరచుకోవడానికి సాంకేతికతను గరిష్టంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముసునూరు ఎంఇఒ సుబ్బారావు శిక్షణ తరగతులకు సెంటర్ కో-ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈ నెల 15వ తేదీ వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

# రాలని చినుకు.. అడుగంటుతున్న గోదారి

**ఖరీఫ్ నారుమడులపై తీవ్రప్రభావం**
**మళ్లీ ఠారెత్తిస్తున్న ఎండలు**
**ఉమ్మడి జిల్లాలో 50 శాతం వరకూ నారుమడులు పూర్తి**
**గోదావరిలో అడుగంటిన నీటిప్రవాహాలు**
**సీలేరు జలాలలే ఆధారంగా ముందుకు**
**నారుమడులకు నీరందక అన్నదాత ఆందోళన**
**ఈసారైనా కౌలురైతులకు రుణాలిచ్చేనా..!**


పశ్చిమలో నీరులేక ఎండుతున్న నారుమడి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగుకు వాతావరణం ఏ మాత్రమూ అనుకూలంగా ఉండటం లేదు. నైరుతి రుతుపవనాలు వచ్చినట్లే వచ్చి ముఖంచాటేశాయి. దీంతో వేసవి తరహాలో మళ్లీ ఎండలు ఠారెత్తిస్తున్నాయి. నారుమడులు వేస్తున్న రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎండలకు మొలకలు మాడిపోయి నారుమడులు దెబ్బతింటున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యారు. జూన్ ఒకటోతేదీన కాలువలకు సాగునీరు విడుదల చేసినప్పటికీ వడగాల్పుల కారణంగా రైతులు నారుమడుల వేసేందుకు వెనుకడుగు వేశారు. దీంతో ఖరీఫ్‌లో ముందస్తు సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. నైరుతి రుతుపవనాల రాకతో జూన్ 20వ తేదీన జిల్లాలో వాతావరణం చల్లబడింది. పలుచోట్ల వర్షాలు పడటంతో రైతులు నారుమడులకు సిద్ధమయ్యారు. గడిచిన వారంరోజులుగా రెండు జిల్లాల్లోనూ రైతులు ముమ్మరంగా ఖరీఫ్ నారుమడులు వేస్తున్నారు. నాలుగు రోజులుగా వాతావరణంలో అనూహ్యమార్పులు చోటుచేసుకున్నాయి. చినుకు జాడలేకుండా పోయింది. మళ్లీ వేసవిని తలపించే విధంగా ఎండలు తీవ్రంగా ఉన్నాయి. దీంతో నారుమడులు వేసిన రైతులు మదనపడుతున్నారు. ఎండల తీవ్రతకు నారుడుల మొలకలు దెబ్బతింటున్నాయి. దీంతో రెండోసారి నారుమడుల వేయాల్సి వచ్చే పరిస్థితి ఏర్పడనుండటంతో రైతులు కలత చెందుతున్నారు. మరోసారి నారుమడి వేయాలంటే అదనపు పెట్టుబడి తప్పదని వారు లబోదిబోమంటున్నారు.

**వర్షపు జాడలేదు.. గోదావరిలో నీళ్లులేవు..**

పది రోజులుగా జిల్లాలో చినుకు జాడ లేకుండాపోయింది. అదే సమయంలో గోదావరిలో నీటిప్రవాహాలు భారీగా పడిపోయినట్లు చెబుతున్నారు. దీంతో నారుమడులకు నీరందకపోవడంతో మొలకలు దెబ్బతింటున్నాయి. దీంతో ఏంచేయాలో తెలీక రైతులు స్ప్రేయర్లతో నారుమడులను తడుపుతున్నారు. ప్రస్తుతం గోదావరిలో నీటిప్రవాహాలు భారీగా పడిపోవటంతో జిల్లాకు రావాల్సిన సాగునీరు రావడం లేదు. సీలేరు జలాలతో నెట్టుకొస్తున్నారు. సోమవారం నుంచి జిల్లాకు 4,250 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఎండల తీవ్రతకు ఈ నీరు ఏమాత్రమూ సరిపోవడం లేదు. పొలాలన్నీ బీటలు వారాయి. నారుమడులు వేసిన రైతులు పొలాలను దమ్ము చేసుకునేందుకు నీరులేక గందరగోళానికి గురవుతున్నారు. వర్షం కోసం రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. ఇప్పటి వరకూ 50 శాతం నారుమడులు పూర్తయ్యాయి. మిగిలిన నారుమడులు వేసేందుకు రైతులు జంకుతున్నారు. దీంతో ఖరీఫ్ సాగు మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఏర్పడింది.

**కౌలురైతులకు పంటరుణాలిస్తారా?**

రెండు జిల్లాల్లో వ్యవసాయ సాగులో 75 శాతం కౌలురైతులే సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైనప్పటికీ కౌలు రుణార్హత కార్డుల ప్రక్రియ పూర్తికాలేదు. ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియడం లేదు. ఈ ఏడాదైనా కౌలురైతులకు బ్యాంకులు పంటరుణాలు అందించే పరిస్థితులు కనిపించడం లేదు. కౌలురైతుల రుణార్హత కార్డుల పంపిణీ త్వరితగతిన పూర్తిచేసి బ్యాంకు రుణాలు అందించాలని కోరుతున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లాలో సాగుతున్న పోరుకేక యాత్ర

# పూల'వర్షం'లో.. పోరుకేక..!

## సమరోత్సాహంతో ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవేశించిన యాత్ర

ప్రజాశక్తి - విజయవాడ, అజిత్ సింగ్‌నగర్

పోలవరం నిర్వాసితులు పోరుకేక మహా పాదయాత్ర సోమవారం సాయంత్రం ఆరు గంటలకు జోరు వర్షంలో ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవేశించింది. విజయవాడ రూరల్ మండలం నున్న, గన్నవరం మండలం ముస్తాబాద సరిహద్దు మీదుగా ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవేశించిన ఈ యాత్రకు విజయవాడ కండ్రిక వద్ద జిల్లాలోకి ప్రవేశించింది. మహా పాదయాత్ర అక్కడి నుండి విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటర్‌కు చేరుకునే సమయంలో పాయకాపురం వద్ద జోరున వర్షం ప్రారంభమైంది అయినా పాదయాత్ర కొనసాగింది. పాదయాత్ర బందంలోని వారు తమ వద్ద ఉన్న గొడుగులు, రైన్ కోట్లు ధరించి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా డాబా కొట్లు సెంటర్ వరకూ కొనసాగించారు. "జిందాబాద్ సిపిఎం...జిందాబాద్ సిపిఎం...మహా పాదయాత్రకు స్వాగతం..." అంటూ యాత్ర పొడవునా నినాదాలు చేశారు. కండ్రిక నుండి ప్రకాష్ నగర్ సెంటర్, పాయకాపురం మీదుగా డాబా కొట్లు సెంటరు వరకు అడుగడుగునా పూలవర్షం కురిపించారు. వందలాది మందితో యాత్ర క్రమశిక్షణాయుతంగా సాగింది. ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగనీయకుండా రెండు లైన్లలో క్రమశిక్షణగా బృందం సభ్యులు నడిచారు. పాదయాత్ర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. నగరంలోని పార్టీ శ్రేణులతోపాటు సిఐటియు, ఐద్వా, ముఠా కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం, హమాలీ, ఆటో వర్కర్స్ యూనియన్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ప్రజానాట్యమండలి తదితర ఉద్యోగ కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాదయాత్రకు పెద్దఎత్తున ఎదురేగి పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. యాత్రకు నేతృత్వం వహిస్తున్న వి.శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చేపట్టిన ఈ యాత్రకు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై,వెంకటేశ్వరరావు (వైవి), సిహెచ్.బాబూరావు, మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు స్వాగతం పలికారు. తెలుగు రైతు గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు దండు సుబ్రహ్మణ్యం రాజు మద్దతు తెలిపారు. యాత్రలో పాల్గొన్న వారికి చిరు ఆదిత్యం ఇచ్చారు. యాత్రకు ఘన స్వాగతం పలికిన వారిలో సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు ఉన్నారు. అనంతరం డాబా కొట్లు సెంటరులో బహిరంగ సభ జరిగింది.

**నేడు యాత్ర ముగింపు - బహిరంగ సభ**
**హాజరుకానున్న పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు**

ఈ మహాపాదయాత్ర మంగళవారం ఉదయం 9 గంటలకు విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ డాబా కొట్లు సెంటరు నుండి ప్రారంభవుతుంది. సింగ్‌నగర్ ఫ్లైవోవర్, ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ సెంటరు మీదుగా అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్ వద్దకు చేరుతుంది. అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభతో మహా పాదయాత్ర ముగుస్తుంది. ఈసభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

ఆందోళన చేస్తున్న దళితులు

## చెరువు అక్రమ తవ్వకాలు అడ్డుకోండి

### సిపిఎం ఆధ్వర్యాన దళితుల ఆందోళన

ప్రజాశక్తి - మండవల్లి

తాగునీటి బావులు కలుషితమయ్యేలా చేపట్టిన రొయ్యల చెరువు తవ్వకాలను నిలుపుదల చేసి దళితులకు రక్షణ కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో కానుకొల్లు కాలనీకి చెందిన దళితులు సోమవారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పొలాల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపట్టిన రొయ్యల చెరువు దగ్గర నుంచి కానుకొల్లు ఆటోస్టాండ్ పుట్లచెరువు రహదారిపై భారీ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బిఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావు విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసరావు దళితులు చేపట్టిన ఆందోళనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానుకొల్లు కాలనీ ఆనుకొని ఎటువంటి అనుమతులు లేకుండా చేపల చెరువు తవ్వకాలు చేపట్టిన రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామానికి చెందిన రహదారిని తవ్వేసి రొయ్యల చెరువు గట్టుగా వేసేశారన్నారు. పంట పొలాలను చెరువులుగా మార్చేస్తే బావులు కలుషితమై తాగునీటి కోసం దళితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల తవ్వకాలు చేపట్టిన పంట పొలాలలో గ్యాస్ పైపులు ఉన్నాయని, ప్రమాదం జరిగితే భారీ స్థాయిలో పెద్ద ప్రమాదం సంభవిస్తుందన్నారు. గ్రామానికి చెందిన నాయకుడు సత్యనారాయణ గతంలో చేపట్టిన చెరువు తవ్వకాలను నిలుపుదల చేసేందుకు అండగా నిలిచి నేడు ఆయనే అదే ప్రాంతంలో చెరువులు తవ్వేలా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నిబంధనలు విరుద్ధంగా చేపట్టిన రొయ్యల చెరువు తవ్వకాలను నిలుపుదల చేసి కానుకొల్లు కాలనీకి చెందిన దళితులకు న్యాయం అందించాలని చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపట్టి రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని ఆయన హెచ్చరించారు. బిఎస్‌పి నియోజకవర్గ కన్వీనర్ మన్నేపల్లి నాగేశ్వరరావు, కర్రే మత్స్యుర్యారావు ఆందోళనలో పాల్గొని దళితులకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు రాయగిరి రాము, ఆక్వా చెరువుల తవ్వకాల వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు మరియ రాజు, యల్లమెల్లి ఆనందరావు, కంతేటి సీమోను, ఉచ్చుల నాగభూషణం, చావల రామస్వామి, కాకాని ఆదాము, మట్టా సుబ్రహ్మణ్యం, జుజ్జవరపు శామ్యూల్, జువ్వనపూడి మరియమ్మ, యల్లమిల్లి కళ్యాణి, దొండపాటి జాస్మిన్, యల్లమిల్లి సునీత పాల్గొన్నారు.


వాల్‌పోస్లరు ఆవిష్కరిస్తున్న నాయకులు

## నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు తెలిపారు. మండలంలోని బయన్నగూడెంలో ఉన్న కొత్తూరు నిర్వాసితుల కాలనీ నిర్వాసితులతో ఇవి.రమణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాంబాబు మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ 2013 పునరావాసం పరిహారం ఇవ్వాలని, 1986, 2022 వరదల్లో మునిగిన గ్రామాలన్నిటిని మొదటి దశ పునరావాసంలో కలపాలని, గోదావరి వరదల నుంచి రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. గతేడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని, తప్పులు తడకలుగా ఉన్న కాంటూరు లెక్కలను మార్చాలని డిమాండ్ చేశారు. అనంతరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కొత్తూరు కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు నిర్మించాలన్నారు. కాలనీలో ఉన్న స్కూలు పిల్లలకు కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం వెళ్లే రోడ్డులో రెండు వైపులా బస్సు షెల్టర్లు నిర్మించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఆర్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆకుల సీతామహాలక్ష్మి, సిహెచ్.లక్ష్మి, ఎం.వీరమణి, టి.భాగ్యలక్ష్మి, సిహెచ్.ముత్యాల రాయుడు, టి.సత్యవతి, టి.వెంకన్న, ఎన్.పుణ్యవతి, ఎన్.సత్యవతి, ఆకుల రఘుపతి, మట్టా వెంకటలక్ష్మి, మన్యం గంగారత్నం, ఎం.కన్నమ్మ, గంటా సూర్యవతి, ఎం.వెంకటరత్నం, కె.రాంబాబు. ఎం.నరసింహమూర్తి, గండిశెట్టి సత్యనారాయణ, ఎం.లక్ష్మీకుమారి, యు.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

**1/70 భూముల సాధనకు**

# గిరిజనులకు అండగా సిపిఎం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

1/70 భూముల సాధనలో గిరిజనులకు సిపిఎం నిత్యం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి స్పష్టం చేశారు. 1/70 భూముల కాకపోయినప్పటికీ స్థానిక సిపిఎం నేతలను, గిరిజనులను రెచ్చగొట్టి తమ భూములను సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని శ్రీనివాసపురం, మర్లగూడేనికి చెందిన కొందరు గిరిజనేతర భూస్వాములు చేస్తున్న దుష్ప్రచారాన్ని సిపిఎం జిల్లాకమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ మేరకు సోమవారం ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. అవాస్తవాలతో కూడిన వినతిపత్రాన్ని ఆ భూస్వాములు ఇటీవల జరిగిన మహాపాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు ఇవ్వడాన్ని గుర్తుచేశారు. ఆ వినతిలో స్థానిక సిపిఎం నాయకత్వంపైన, గిరిజనులపైన తీవ్రమైన నిందాప్రచారాలతో కూడిన అంశాలను పేర్కొన్నారని, దీన్ని సిపిఎం జిల్లా కమిటీ ఖండిస్తుందన్నారు. బుట్టాయగూడెం మండలం మర్లగూడెంలో ఆర్‌ఎస్ నెంబర్ 39, 40, 41, 43/3లోని 30 ఎకరాలు 1970 తర్వాత అమ్మకాలు, కొనుగోలు జరిగాయని, మారకాలు జరిగాయని అవి 1/70 చట్టం వర్తించదని సిపిఎం పేర్కొంటున్నారు. అవి ఏ రకంగానూ ఆ భూస్వాములకు చెందవని స్పష్టం చేసిందన్నారు. 1970 తర్వాత ఆ భూముల్లో కొంతభాగం తన్నీరు తాతయ్య కుటుంబం నుండి బండారువారి కుటుంబం కొనుగోలు చేసిందన్నారు. అలాగే తన్నీరు తాతయ్య తమ అల్లుళ్లకు కట్నంగా కూడా ఇచ్చారన్నారు. 1970 తర్వాత అమ్మకాలు, కొనుగోలు గానీ, కట్నకానుకలుగా ఇవ్వడం గానీ షెడ్యూల్డ్ ప్రాంతంలో చెల్లదన్నారు. ఈ భూములపై 30 ఏళ్లుగా మర్లగూడెం గిరిజనులు పోరాడి సాగు చేసుకుంటున్నారని, ధన, అధికార బలంతో పదేపదే కోర్టుకు వెళ్లి అధికారుల నుండి ప్రొటెక్షన్ ఆర్డర్లు తెచ్చుకున్నంత మాత్రాన ఆ భూములు వారికి చెందవని తెలిపారు. ప్రొటెక్షన్ ఆర్డర్‌కు సాగుకాలం మాత్రమే కాలపరిమితి ఉంటుందని 2017 నాటి ప్రొటెక్షన్ ఆర్డర్లు చూపించి పక్కదోవ పట్టిస్తే సహించబోమన్నారు. ఆర్‌డిఓ, నాగేశ్వరరావు సమక్షంలో జరిగిన భూ పరిశీలనలో వీరికి భూములు ఏ మాత్రం చెందవని, ఆ భూస్వాములను ఆయన కరాకండీగా తేల్చిచెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. నాన్ షెడ్యూల్ ప్రాంతం శ్రీనివాసపురానికి చెందినవారికి షెడ్యూల్ ప్రాంతంలోని స్థానిక గిరిజనులకు చెందిన భూములు తమ అధికార, ధనబలంతో తమవేనని చెప్పినంత మాత్రాన చెల్లదన్నారు. ప్రస్తుతం ఈ భూమిపై కెఆర్.పురం ఐటిడిఎ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్నారు. ఇది పూర్తిగా వైసిపి నాయకుడు పొల్నాటి బాబ్జీ తెరవెనుక ఉండి ఓవైపు తనబంధువులను, మరోపక్క ఈ భూమికి ఏమాత్రం సంబంధంలేని కొందరు దళితులను మభ్యపెట్టి తీసుకొచ్చి ఘర్షణలు సృష్టిస్తున్నాడన్నారు. గిరిజనులు, దళితుల కోసం నిజంగా కట్టుబడితే వైసిపి అయితే గిరిజనులకు చెందిన భూములను కాజేయడానికి ఇలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. సిపిఎం షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలకు అనుగుణంగా గిరిజనులకు అండగా ఉంటుందని, అందుకు ఎవరెన్ని కుట్రలు పన్నినా, దుష్ప్రచారం సాగించినా వాటిని ఛేదిస్తుందని సిపిఎం జిల్లాకార్యదర్శి ఎ.రవి పేర్కొన్నారు.

# సహకార సంఘాల నిర్వీర్యానికే విలీనం

ప్రజాశక్తి - ఏలూరు


ధర్నా చేస్తున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను నిర్వీర్యం చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను పిఎసిఎస్‌లో విలీనం చేస్తున్నారని రాష్ట్ర అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ విమర్శించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద జిల్లాకమిటీ ఆధ్వర్యంలో సొసైటీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎసిఎస్‌లలో రైతు భరోసా కేంద్రాల విలీనాన్ని నిలిపివేయాలని, పిఎసిఎస్‌లలో 50శాతం వాటాను ప్రయివేటు వ్యక్తులకు ఇచ్చే ఆలోచన ఉపసంహరించుకోవాలని, వేతన సవరణ చేపట్టాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా హాజరైన పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను నిర్వీర్యం చేసేలా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. సహకార సంఘాల్లో 50శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సహకార సంఘాలను పటిష్టం చేస్తానని హామీ ఇచ్చిన సిఎం జగన్ ప్రస్తుతం సహకార సంఘాలనే ప్రయివేటుపరం చేస్తున్నరని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ చట్ట సవరణ ప్రకారం 50 శాతం షేర్లను బయట వ్యక్తులకు, సంస్థలకు అమ్మే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, చట్ట సవరణను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

జిఒ 36, 90 ప్రకారం వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీని చట్ట ప్రకారం అమలు చేయాలని విజ్ఞప్తిచేశారు. హెచ్‌ఆర్ పాలసీలో లోటుపాట్లు సరిచేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సొసైటీ ఉద్యోగుల వేతన సవరణను డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ప్రత్యేక కమిటీ ద్వారా ప్రతి ఐదేళ్లకు ఒకసారి చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, రాష్ట్ర నాయకులు టి.గంగరాజు మాట్లాడుతూ పిఎసిఎస్‌ను ప్రయివేటు వ్యక్తులకు, సంస్థలకు అమ్మచూపే ప్రయత్నాలు విరమించాలని డిమాండ్ చేశారు. జిఒ 36 ప్రకారం వేతనాలను, ఇతర బెనిఫిట్లను అమలు చేయాలని కోరారు. 2019 నుండి కొత్తవేతన సవరణ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలనీ కోరారు. డిసిసిబి రైతుల నుంచి వెనక్కి కట్టించుకున్న ఆరుశాతం వడ్డీ రాయితీ వెంటనే సర్దుబాటు చేయాలనీ, 2010-11 నుండి నేటి వరకూ 13 సంవత్సరాల క్రితం సహకార సంఘాల ధనంపై రావాల్సిన ఆరు శాతం డివిడెండు, వడ్డీ వెంటనే చెల్లించాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిమాత్రం సమర్పించారు. ధర్నాకు యూనియన్ నాయకులు పి.సుబ్బారావు, జి.వీరయ్య నాయకత్వం వహించారు.

**నేడు విజయవాడలో**

# 'పోరుకేక మహాధర్నా'ను జయప్రదం చేయాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి**

ప్రజాశక్తి - ఏలూరు

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల నాలుగో తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాలో జిల్లాలోని సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. ఈ మహాధర్నాలో సిపిఎం కేంద్రం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, సిపిఎం జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం గతనెల 20వ తేదీన అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక మండలం నెల్లిపాక నుండి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సారథ్యంలో పోలవరం నిర్వాసితుల పోరుకేక మహాపాదయాత్ర చేపట్టారని, ప్రస్తుతం ఈ యాత్ర ఏలూరు, కృష్ణా జిల్లాలు దాటి ఎన్‌టిఆర్ జిల్లాలోకి ప్రవేశించిందని తెలిపారు. 18 రోజులు, దాదాపుగా 400 కిలోమీటర్ల పైబడి ఈ పాదయాత్ర సాగి నాలుగో తేదీన విజయవాడ చేరుకుని ధర్నా చౌక్ వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి నిర్వాసితుల సమస్యలను, పునరావాస కేంద్రాల్లో వారి ఇబ్బందులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళతామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు తమ సర్వస్వాన్ని కోల్పోయి ఆంధ్ర రాష్ట్రానికి సాగునీరు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించడం కోసం త్యాగాలు చేస్తుంటే వారిని అన్ని విధాల ఆదుకోవాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని, నిర్వాసితులకు ఇవ్వాల్సిన న్యాయమైన పరిహారం మాత్రమే తాము డిమాండ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ఈ పాదయాత్ర ఎన్నికల కోసం కాదని, అధికారుల కోసం అంతకన్నా కాదని, పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే అమాయక గిరిజనుల గోడును, నిర్వాసితుల కష్టాలను రాష్ట్ర ప్రజల దృష్టికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్లేందుకే సాగిస్తున్నామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పక్షాన రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, ప్రజలంతా నిలవాలని, మద్దతు, సంఘీభావం తెలపాలని ఆయన కోరారు.

**పోలవరం:** పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం పోరుకేక యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత నెల 20వ తేదీన నెల్లిపాక గ్రామంలో పోలవరం పోరుకేక యాత్ర ప్రారంభమైందని తెలిపారు. ఈ నెల నాలుగో తేదీన విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. భూమికి భూమి, పోడు భూములు కల్పించలేదన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం కలెక్టర్ చుట్టూ, ఆర్‌డిఒ కార్యాలయాల చుట్టూ ఎనిమిదేళ్ల నుంచి తిరుగుతూనే ఉన్నారన్నారు. అయినప్పటికీ సమస్యలకు పరిష్కారం లభించలేదన్నారు. నాలుగో తేదీన విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం, మినిమం టైం స్కేలు అమలు చేస్తామని, అర్హత ప్రమాణాల ఆధారంగా వీలైనంత ఎక్కువ మంది ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సిఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎన్‌హెచ్‌ఎం జెఎసి ఛైర్మన్ డి.దయామని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరులో సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల పోరాటం ఫలితంగా వైద్యారోగ్యశాఖ ఉన్నతస్థాయి అధికారులు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రతినిధులతో చర్చల్లో ఒప్పందం మేరకు జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచుతూ ఆదేశాలు ఇవ్వటం, తొమ్మిది రోజుల వ్యవధిలో వేతనాలు తగ్గిస్తూ జిఒ నెంబర్ 64 ఉత్తర్వులు ఇచ్చి నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్యశాఖ ఉన్నతస్థాయి అధికారులు మోసం చేయటం అన్యాయమన్నారు. దీనిపై ఉద్యోగులందరూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని, ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. గత నెల నుంచి వివిధ రూపాల్లో నిరసన తెలియచేస్తున్నా నేటికీ అధికారులు స్పందించకపోవడం ఉద్యోగులను మరింత ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ఈ నెల ఏడో తేదీన సామూహికంగా జగనన్నకు చెబుదాం చలో తాడేపల్లి కార్యక్రమంలో ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరు జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ఎహెచ్‌ఎం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి వారి న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చాలని, మొదటిగా ప్రకటించిన జిఒ నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు స్వర్ణ, కుసుమ, దీవెన, వెంకటరమణ, సుమాదిపిక, ఉపేంద్ర పాల్గొన్నారు.

బహుమతులు అందిస్తున్న ఎంఎల్ఎ మేకా ప్రతాప్ అప్పారావు

## ముగిసిన బాస్కెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని డిఎఆర్ కళాశాల ఆవరణలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఎనిమిదో అంతర్ జిల్లా జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు ముగిశాయి. బాలుర విజేతగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు, బాలికల విజేతగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లు నిలిచాయి. విజేతలకు ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు చేతులమీదుగా కప్పు, మెమొంటో అందించారు.

## మొక్కలు నాటిని సత్యసాయి సేవా సమితి

ప్రజాశక్తి - భీమడోలు

సత్యసాయి సేవా సమితి రాష్ట్ర కార్యవర్గం పిలుపుమేరకు భీమడోలు శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని భీమడోలులో సోమవారం ప్రారంభించామని భీమడోలు శాఖ సమన్వయకర్త వర్ధనీడి సత్యసాయి తెలిపారు. తొలిదశగా భీమడోలులోని సూరప్పగూడెం వై.జంక్షన్ వద్ద 130 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాఖ జిల్లా అధ్యక్షులు కె.శేఖర్‌రావు, కార్యవర్గ సభ్యులు కెఎల్ఎన్.మూర్తి, వై.సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేఖర్‌రావు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో నిర్వహించనున్న సత్యసాయిబాబా వందో జయంతి పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు దేశవ్యాప్తంగా పది మిలియన్ మొక్కల నాటడం లక్ష్యంగా సమితి నిర్ణయించిందన్నారు. త్వరలోనే భీమడోలు గ్రామపంచాయతీ సహకారంతో హైస్కూల్ ఎదురుగా గల తిమ్మన చెరువు చుట్టూ మొక్కలు నాటడంతో పాటు వాటి పోషణ, రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సత్యసాయి సేవా సమితికి చెందిన పలువురు సభ్యులు పాల్గొన్నారు

## దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని మలేరియా సబ్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి యలమంద మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు దోమల కారణంగా వ్యాప్తి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉత్తమ సేవలందించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు టివి.రామకృష్ణ, దివి విజయసారథి, సయ్యద్ జానీ, కెఎస్ఎస్ సుశీలావతిలను సోమవారం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో లయన్స్ క్లబ్ యూత్ క్యాంప్స్ జిల్లా ఛైర్మన్ పంతగాని వెంకన్న మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయం ప్రకారం గురుపూర్ణిమ రోజు గురువులను సత్కరించుకోవడం ఆనందదాయకమన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కన్నం హనుమంతరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.

## మెరుగైన సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా చేపట్టిన ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు మెరుగైన సమాజం కోసం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల శాఖ అత్యవసర సమావేశాన్ని స్థానిక స్టేషన్ రోడ్డులో మండల అధ్యక్షులు టెంటు అప్పారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మండల కమిటీ బలోపేతం చేసే విధంగా పలు సూచనలను సలహాలను అందించారు. ప్రతినెలా రెండో ఆదివారం మండల కమిటీ సమావేశం నిర్వహించాలని ఈ నెల 21వ తేదీన రాష్ట్ర బాధ్యులతో మండవల్లిలో నిర్వహించే సమావేశానికి సభ్యులంతా తప్పనిసరిగా హాజరు కావాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్, పొన్నూరు రామచంద్రరావు, వి.బేబీసరోజిని, వరద శ్యామ్, శ్రీనివాసరావు, కె.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

## సర్పంచికి నోటీసులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎపి సర్పంచుల వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపుమేరకు సోమవారం జరిగే సర్పంచుల సమావేశానికి హాజరు కావద్దని, పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని తెలుపుతూ ఉంగుటూరు సర్పంచి బండారు సింధుకు పోలీసులు ఆదివారం రాత్రి నోటీసులు అందించారు.

# నేరాలు - ఘోరాలు

## తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తెలంగాణ నుంచి అక్రమంగా కామయ్యపాలెం వైపునకు తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... కామయ్యపాలెం చెక్‌పోస్ట్ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా తెలంగాణలోని ఉట్లపల్లి గ్రామం నుంచి ఆంధ్ర ప్రాంతంలోకి అక్రమంగా తరలిస్తున్న 250 క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని, షేక్ హుస్సేన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

## ఇష్టంలేని పెళ్లి చేశారని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇష్టం లేని వివాహం చేశారనే మనస్తాపంతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మక్కినవారిగూడెంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన పవన్‌శర్మ (32) మక్కినవారిగూడెం శివాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. పవన్ శర్మకు జూన్ తొమ్మిదో తేదీన గుంటూరు జిల్లా సీతా నగరానికి చెందిన యువతితో వివాహమైంది. అప్పటి నుంచి పవన్ శర్మ ఎవరితోను సరిగా మాట్లాడడంలేదు. ఈ నెల రెండో తేదీన కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో పుట్టినరోజు వేడుకలకు తిరువూరు వెళ్లిన తరువాత పవన్‌శర్మ తల్లి ఇంటికి ఫోన్ చేయగా తీయకపోవడంతో పక్కన ఉండే నానికి ఫోన్ చేయగా అతను వెళ్లి చూడగా పవన్ శర్మ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించి సమాచారం అందించాడు. మృతుని తల్లి పద్మావతి ఫిర్యాదుతో ఎఎస్ఐ ఎ.జయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఇనుప రాడ్డుతో వ్యక్తిపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్నవరం గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో మూడు ముంతల జమలయ్య (56)పై అతని సోదరుడు దుర్గాప్రసాద్ కుమారుడు ఇనుప రాడ్లతో దాడి చేశాడు. ఈ దాడిలో జమలయ్య తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# పిచ్చిమొక్కలతో వంతెనకు బీటలు

పోల్‌రాజ్ వంతెన దిమ్మెల మధ్యలో మొలచిన పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని పోల్‌రాజ్ కెనాల్ వంతెన దిమ్మెలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. ఈ వంతెన విజయవాడ-భీమవరం ప్రధాన రహదారిలో ముదినేపల్లి సెంటర్‌లో పోల్‌రాజ్ కెనాల్‌పై ఉంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ వంతెన దిమ్మెల మధ్యలో పిచ్చిమొక్కలు పెరిగాయి. మొక్కల వేర్లు దిమ్మెల సందుల్లో లోనికి వెళ్లడంతో వంతెనకు బీటలు ఏర్పడ్డాయి. ఈ వేర్లు వంతెనకు ఇవతల నుంచి అవతల వైపునకు వ్యాపించడంతో వంతెనకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. నిత్యం సంబంధిత శాఖల అధికారులు వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అయినా అధికారులు వంతెనపై మొలచిన పిచ్చిమొక్కలు కనబడకపోవడం గమనార్హం. ఈ వంతెన నిర్మించి సుమారు 30 ఏళ్లు కావస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనపై మొలచిన మొక్కలు నిర్మూలన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# డ్రెయిన్‌లో దిగబడిన బస్సు

డ్రెయిన్‌లో దిగబడిన స్కూల్ బస్సు

### విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఈ ఏడాది విద్య సంవత్సరం ప్రారంభమై 20 రోజులు పైబడింది. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులు ప్రయాణించాల్సి వస్తోంది. సోమవారం ముదినేపల్లిలోని ఓ ప్రయివేటు విద్యాసంస్థకు చెందిన స్కూల్ బస్సు మండలంలోని వివిధ గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకుని స్కూల్ వెళ్తుండగా స్కూల్‌కు వెళ్లే మార్గంలో డ్రైవర్ బస్సును మలుపు తిప్పుతుండగా బస్సు వెనుకు వైపు ఉన్న రెండు చక్రాలు డ్రెయిన్‌లో దిగబడ్డాయి. డ్రైవర్ చాకచక్యం వల్ల బస్సులోని విద్యార్థులకు పెద్ద ప్రమాదం తప్పింది. స్కూల్‌కు అతి సమీపంలోనే ఈ ఘటన జరగడంతో స్కూల్ యాజమాన్యం వెంటనే స్పందించి ఘటన స్థలానికి చేరుకున్నారు. బస్సులోని విద్యార్థులను దింపి స్కూల్‌కి పంపించారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు భయందోళన చెందారు. దీనిపై ఎంఇఒ కె.నరేష్‌కుమార్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదన్నారు. ఎస్ఐ షణ్ముఖసాయిని వివరణ కోరగా ఈ ఘటనలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. బస్సులోని విద్యార్థులంతా క్షేమంగా బయటపడ్డారన్నారు. అనంతరం స్కూల్ బస్సును క్రెయిన్ సాయంతో డ్రెయిన్ నుంచి బయటకు తీశారు.

**విలేకరిపై అధినేత రుసరుసలు**

విధి నిర్వహణలో ఉన్న ప్రజాశక్తి విలేకరి ఈ స్కూల్ బస్సు ఫొటో తీసిన విషయం తెలుసుకున్న ముదినేపల్లిలోని ఓ ప్రయివేట్ విద్యాసంస్థ అధినేత విలేకరికి ఫోన్ చేసి 'నా స్కూల్ బస్సు ఫొటో తీయడానికి నీకు ఎంత ధైర్యం, ఇంతవరకు నా స్కూల్ ఫొటో జిల్లాలో ఏ విలేకరి తీయలేదు. నేను ఒకప్పుడు సీనియర్ రాజకీయ నాయకుడిని, మాజీ ప్రజాప్రతినిధిని, జిల్లాలో పలు విద్యాసంస్థలకు అధిపతిని, నా పలుకుబడి ముందు నీవెంత, నా బస్సు గురంచి వార్త రాస్తే ఊరుకునేది లేదు, నీపై ప్రెస్ కౌన్సిల్‌కి వెళ్తా, నీ పేపర్ యాజమాన్యానికి నీపై ఫిర్యాదు చేస్తాను' అంటూ విలేకరిని బెదిరించాడు.

# పలు మండలాల్లో ఎంఇఒల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు విద్యాధికారి-1గా ఇ.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. మూడేళ్ల నుంచి ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్న సాంబశివరావు బాధ్యతలను శ్రీనివాసరావుకు అప్పగించారు. కొయ్యలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఇ.శ్రీనివాసరావు ప్రభుత్వం చేపట్టిన సర్దుబాటు చర్యలో భాగంగా భీమడోలు విద్యాధికారి-1గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యాప్తికి ప్రభుత్వం ఆదేశించిన అన్ని విధానాలను అమలు చేసి విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పలు ఉపాధ్యాయ సంఘాల నేతలతో పాటు ఇప్పటివరకు విద్యాధికారిగా పనిచేసిన సాంబశివరావు భీమడోలు విద్యాధికారి నెంబర్-2 భాస్కర్ కుమార్ ఇ.శ్రీనివాసరావును అభినందించారు.

**ఆగిరిపల్లి** : ఆగిరిపల్లి మండల విద్యాశాఖాధికారి-1గా అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కలపాల సర్వేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల విద్యాశాఖాధికారి-2గా సూరవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న కొవ్వలి ఆనంద్‌కుమార్ గతంలోనే బాధ్యతలు స్వీకరించారు.

**ఉంగుటూరు** :ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి-1గా ఏలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిమ్మగడ్డ రవీంద్ర భారతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు ఎంఇఒ-2 కె.శ్రీనివాసరావు, విద్యాకార్యాలయ సిబ్బంది, యుటిఎఫ్ మండల కమిటీ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

**ఎంఇఒ నరేష్‌కుమార్‌కు సత్కారం**

**కలిదిండి** : ఎంఇఒ కొల్లాటి నరేష్‌కుమార్‌ను ఎపి ప్రయివేట్ స్కూల్ కైకలూరు డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక శశి హైస్కూల్‌లో సన్మానించారు. ఆయన కలిదిండి ఎంఇఒగా ఆరేళ్లు విశేష సేవలందించినట్లు అప్సా రాష్ట్ర గౌరవాధ్యక్షులు చెన్నంశెట్టి కృష్ణ అన్నారు. కొల్లాటి నరేష్‌కుమార్‌ను దుస్సాలువాతో సత్కరించి, మెమెంటో అందించారు. ఆయన బదిలీపై ముదినేపల్లి ఎంఇఒగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో అప్సా కైకలూరు డివిజన్ అధ్యక్షులు ఎవి.కోటేశ్వరరావు, కోశాధికారి పిటివి.కుటుంబరావు, శశి హై స్కూల్ కరెస్పాండెంట్ జివి.సత్యనారాయణ రాజు, మండల పరిధిలోని విద్యాసంస్థల అధినేతలు పాల్గొన్నారు.

# ఘనంగా మెకానిక్ డే వేడుకలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో సోమవారం మెకానిక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక గురజ రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖసాయి ముఖ్యఅతిథిగా విచ్చేసి మెకానిక్‌ల సమక్షంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. ఆనంతరం మెకానిక్‌లు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. తొలుత ఎపి టూ వీలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ముదినేపల్లి నుంచి సింగరాయపాలెం,గురజ గ్రామాల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చిలుకోటి నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ మంగినేని బాబ్జి కార్యదర్శి ఎం.ఫణి, కోశాధికారి ఎండి బాజాని, పోలీసులు, తదితర మెకానిక్‌లు పాల్గొన్నారు.

## రోడ్డు నియమాలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రోడ్డు భద్రతా నియమాలను అతిక్రమించినా, ట్రాఫిక్ ఆంక్షలను ఉల్లఘించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు హెచ్చరించారు. సోమవారం ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో జహీర్ హోటల్, పెద్ద కొరాయి, యూనియన్ బ్యాంక్ వద్ద ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ క్లియరెన్స్ చర్యలను చేపట్టారు.

## పలుగ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర భవిష్యత్తుకు దశ దిశ నిర్దేశించగలిగిన వ్యక్తి ఒక్క నారా చంద్రబాబునాయుడు మాత్రమే అని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వేల్పుచర్ల, కొత్తూరు గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి అంటూ అందలం ఎక్కిన జగన్ రెడ్డి తాను ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాల కన్నా రద్దు చేసిన పథకాలు ఎక్కువ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, సర్పంచి గద్దల సుహాసిని, మోహన్‌రావు, ఎంపిటిసి సభ్యులు, నాగమంజుల శ్రీనివాసరావు, మానం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

ముసునూరులో...

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని లోపూడి గ్రామ పంచాయతీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ముసునూరు మండల ప్రత్యేక అధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల కన్వీనర్, జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి రాజానాయన, గ్రామ సర్పంచి పేరం కృష్ణ హాజరయ్యారు. ఎంపిడిఒ జి.రాణి ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ దాసరి సుధ, సొసైటీ అధ్యక్షులు, మండలంలోని గ్రామ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఎం.స్రవంతి , సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

**పోలవరం** : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పోలవరం సర్పంచి పొడుం పుష్ప అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం పోలవరం సర్పంచి పొడుం పుష్ప అధ్యక్షతన పోలవరం సచివాలయం-1 లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐటిడిఎ పిఒ వి.సత్యనారాయణ పాల్గొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కౌంటర్లు ఏర్పాటు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తుల నుంచి వారి సమస్యలను స్వీకరించారు. అనంతరం అర్హులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందించారు. అనంతరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, తహాశీల్దార్ బి.సుమతి, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, సిఐ కె.విజయబాబు పాల్గొన్నారు.

**చింతలపూడి** : మండలంలోని రేచర్ల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో 84 ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవికుమార్, మండల అధికారులు పాల్గొన్నారు.

**ఉంగుటూరు :** వెల్లమిల్లి-1,2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి, డిఎల్‌డిఒ డి.రమణ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వస్కా కుమార్‌రాజా, తహాశీల్దార్ రమణరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, డిటీ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఇఒపిఆర్‌డి షేక్ షంషుద్దీన్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి** : మండల పరిధిలోని వట్టిగుడిపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి వై.కిరణ్మయి, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, ఎంపిపి జి.అనూష పాల్గొన్నారు.

**ముదినేపల్లి** : ప్రజాసమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో జగనన్న సురక్ష గ్రామసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపిటిసి సభ్యులు ఎం.నాగదుర్గ, పార్టీ మండల కన్వీనర్ ఎం.ఏసుబాబు, శీలం రామకృష్ణ గంటా కోటేశ్వరరావు, బొర్రా శేషుబాబు, తహాశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి పాల్గొన్నారు.

**టి.నరసాపురం** : మండలంలోని అప్పలరాజుగూడెం గ్రామంలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ జెవి.సుబ్బారావు, ఎంపిపి డి.లక్ష్మి, మండల కన్వీనర్ శ్రీనురాజు, కె.జగ్గవరం సొసైటీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి మధు, సర్పంచి మూర్తి, ఎంపిటిసి సభ్యులు కె.రామభాస్కర రెడ్డి పాల్గొన్నారు.

**నూజివీడు రూరల్** : మండలంలోని రామన్నగూడెం, బోరవంచ, వట్టిగుడిపాడు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధాలు చెప్పే వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పథకాలు అమలు చేయకుండా అధికారం కోసం నేడు మాయమాటలు చెబుతున్నారన్నారు.

**కోతుల దాడుల నుంచి కాపాడాలని వినతి**

**భీమడోలు** :కోతుల దాడుల నుంచి తమను కాపాడాలని కోరుకొల్లు గ్రామపంచాయతీ ప్రజలు సోమవారం తమ గ్రామానికి వచ్చిన జగనన్న సురక్ష క్యాంపు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామ సర్పంచి దాట్ల సుబ్బలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపునకు ప్రోగ్రామ్ అధికారిగా ఐకెపి భీమడోలు ఎపిఎం శరత్‌కుమార్, రెవెన్యూ అధికారిగా గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.లావణ్య వ్యవహరించారు. క్యాంపును మండల కమిటీ సభ్యులైన భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, డిప్యూటీ తహాశీల్దార్ షంషుద్దీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశీలకులుగా మండల పత్యేక అధికారి డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు పాల్గొన్నారు. కార్యక్రమానికి అతిథిగా ఎంపిటిసి సభ్యులు తోటకూర రామలింగరాజు హాజరయ్యారు. గ్రామపంచాయతీ పరిధిలో 356 గృహాలు ఉండగా వీటిలో 336 ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ప్రజల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన 258 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా 236 మందికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు అందించారు. ఇక గ్రామ పరిధిలో 2200 ఎకరాల విస్తీర్ణంలో ఆక్వాసాగు జరుగుతున్నట్లు నివేదికలను సమర్పించారు. ఈ ఫిష్ సర్వే సందర్భంగా 84 మంది ఆక్వా రైతులకు రాయితీ విద్యుత్తుకు అర్హులుగా గుర్తించారు.

**In The Court Of The 3rd Additional Distirct Judge at Kakinada :: (MACT)**
**M.V.O.P.No. 87/2020**
*Between:*
Bagu Sri Vijaya and Others ...*Petitioners*
AND
Kakarla Srinivasa Rao @ Srinivas and Others ...*Respondents*
*TO: R-1:* Kakarla Srinivasa Rao @ Srinivas, S/o. Satyanarayana, Private Employee, R/o. D.No. 26-156, Ballavari Street, Cherukuwada Village, Penugonda Mandalam, West Godavari District.
పై నెంబరు పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.14-07-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై పిటీషను మీకు పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
డి.సుబ్రహ్మణ్యం
వి.వి.వి.ఎస్.ఎల్.కిరణ్,
ఎం.ధనుంజయరావు
అడ్వకేట్స్, భానుగుడి జంక్షన్, కాకినాడ. సెల్: 98497 15132

**పాస్‌పోర్టు పోయినది**
మాతి మరియమ్మ, భర్త: బలరామ్ అను నేను నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పెనుమంట్ర నుండి ఆటోలో మార్టేరు వస్తుండగా నా యొక్క పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్టు నెంబరు **L7692246** గల పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.
అడ్రస్:
**మాతి మరియమ్మ**
**భర్త: బలరామ్, పెనుమంట్ర మండలం**
**పశ్చిమగోదావరి జిల్లా**
**పిన్‌కోడ్: 534124**
**సెల్: 7287843987**

**పాస్‌పోర్టు పోయినది**
పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం పట్టణం, రెస్ట్ హౌస్ రోడ్డు, డోర్ నెంబర్: 21-10-19, విజయవలక్ష్మి నగర్, శంకరమఠం ఎదురుగా ఇంటిలో నివాసం ఉంటున్న కోరుకొండ శివయ్య, S/o. నరసింహమూర్తి కు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం. **F0682835** పోయినది. ది. 05-05-2023వ తేదీన ఒక కవర్‌లో నా పాస్‌పోర్టు పెట్టుకుని రెస్ట్ హౌస్ రోడ్డు నుండి భీమవరం తహాశీల్దార్ వారి కార్యాలయానికి ద్విచక్ర వాహనం మీద వస్తుండగా మార్గం మధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో ఈక్రింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు.
**సెల్: 9866518495**

**CHANGE OF NAME**
**I, NAIMA SULTHANA BAIG, W/o. Asudulla Baig,** Female, Aged about 45 years, R/o. H.No. 7A-11-12/2, Near Clock Tower, Old Vegetables Market, Opp. Meda Badi, Eluru-534001, Eluru District, A.P. Do hereby solemnly affirm and state as follows. I submit that changing my name from **NAYEEMA SULTANA (Old Name) to NAIMA SULTHANA BAIG (New Name), W/o. Asudulla Baig.** Hence Forth Iam being called as **NAIMA SUTHANA BAIG (New Name)** for all Purposess. The above facts are ture and correct and I have not concealed or misrepresented any facts. I may be held responsible by all things /consequences that may be arise because of the above concerned.
**NAIMA SULTHANA BAIG**
**Cell: 90633 98222**

**పేరు మార్పు ప్రకటన**
**చనుమూరి రామచంద్రం** (కొత్త పేరు), తండ్రి: చనుమూరి అవతారం. గతంలో నా పేరు **చలుమురి రామచంద్రం** (పాత పేరు), తండ్రి: చలుమురి అవతారం, డోర్ నెం. 7-172/1, మాముడూరు గ్రామం, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు నివసించుచున్నాను. ఇప్పుడు నా పేరును **చలుమురి రామచంద్రం (పాత పేరు),** తండ్రి: చలుమురి అవతారం నుండి **చనుమూరి రామచంద్రం (కొత్త పేరు),** తండ్రి: చనుమూరి అవతారం గా మార్చుకున్నాను. ఈ రోజు నుండి తదుపరి అన్ని లావాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను.
**చనుమూరి రామచంద్రం**
**సెల్: 9676263210**

**In the Court of the VIIth (Family) Addl. District Judge, Eluru, W.G.Dt.,**
**A.S. 75/2016**
*Between:*
Mir Ishaik Ali ...*Applicants*
Vs
Kandula Lakshmana Rao (died) and Others ...*Respondents*
*R-41:* Smt. Kandula Govardhanamma, W/o. late Kandula Lakshmana Rao, R/o. D.No. 6-B2-56, West Godavari District, Eluru, Eluru JCJC.
*R-42:* Smt. Sidde Kalpana, W/o. Nageswara Rao, R/o. Near Hanuman Temple, Hanuman Junction, Krishna District, Gannavaram JCJC.
పై నెంబర్ గ్రంధములో O.S. 1091/2001 Ist Addl. Junior Civil Judge, Eluru కోర్టు వారు Pass చేసిన Judgement and Decree పైన పై Appeal దాఖలు చేసియున్నారు. సదరు Appeal లో మీకు (R41, R42) ఏమైన అభ్యంతరము ఉన్న యెడల **ది. 10-7-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలను తెలియజేసుకొన వలెను. లేని యెడల పరోక్షంగా Order Pass చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
**P.B.NARASIMHA MURTHY**
Advocate, Eluru
Cell: 9848143125

ప్రకటన
**In the Court of the Hon'ble Senior Civil Judge, Tadepalligudem**
**H.M.O.P. No. 154/2022**
*Between:*
Sri Jana Nageswara Rao ...*Petitioner*
AND
Smt. Jana Savitri ...*Respondent*
*To:*
Smt. Jana Sivitri, W/o. Nageswara Rao, D/o. Veeramalla Sattemma, aged 40 years, Hindu, Female, R/o. D.No. 14-2, Donthavaram Village, Vungutur Mandal.
పై నెంబరు గల విడాకుల కేసులో పైన తెలిపిన గౌరవ కోర్టు వారు మీకు సమన్లు జారీ చేసి మిమ్మల్ని కోర్టుకు హాజరు కావాలని ఆదేశించినప్పటికి, సదరు సమన్లను మీరు తీసుకోనందు వలన పైన తెలిపిన గౌరవ కోర్టు వారు ప్రత్యామ్నాయంగా ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లను మీకు సర్వీసు చేయమని ఆదేశించి యున్నారు. అందువలన మీకు తెలుపునది ఏమనగా పై నెంబరు కలిగిన విడాకుల కేసు ది. 20-07-2023వ తేదీకి వాయిదా పడి యున్నది. ఆ దినమున అనగా **ది. 20-07-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పైన తెలిపిన గౌరవ కోర్టు వారి ముందు తప్పనిసరిగా హాజరు కావలెను. ఆవిధంగా హాజరు కాని యెడల గౌరవ కోర్టు వారు మిమ్ముల్ని ఎక్స్ పార్టీ చేసి మీకు వ్యతిరేకంగా తీర్మానించెదరని యిందు మూలముగా మీకు తెలుపడమైనది.
*(By Order of Hon'ble Senior Civil Judge at Tadepalligudem in I.A. No. 644/2023, Dt. 15-06-2023)*
Tadepallitgudem **P.PADMAVATHI**
Dt.03-7-23 Advocate, Tadepalligudem

**మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు**
**యం.వి.ఓ.పి. నెం. 125/2021**
*బిట్వీన్:*
పొట్లూరి అమ్మాజీ మరియు 3గురు ఇతరులు **-పిటీషనర్స్**
మరియు
మహమ్మద్ దిల్ షాద్ మరియు ఇద్దరు ఇతరులు **-రెస్పాండెంట్స్**
*1వ రెస్పాండెంట్:* మహమ్మద్ దిల్ షాద్, తండ్రి: ఆమరుద్దీన్, ముస్లిం, మగ, వయస్సు 32 సం॥లు, లారీ డ్రైవర్, అడ్రసు: బబితపూర్ విలేజ్, బస్నత్‌పూర్ తానా, శివాన్ అస్ట్రీచ్, కావసపూర్ పోస్ట్, బీహార్ రాష్ట్రం.
పై నెంబరు గ్రంధములో మీరు 1వ రెస్పాండెంట్ అయి వున్నారు. మేము కోర్టు ద్వారా మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. అందువలన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం పత్రికాముఖంగా తెలియ జేయునది ఏమనగా, **ది. 28-7-2023వ తేదీన** పై నెంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు యెదుట మీ హాజరు నిమిత్తం వాయిదా అయివున్నది. కావున ఆరోజు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై నెంబరు గ్రంధము మీ యొక్క పరోక్షంగా విచారించబడును.
**మాగంటి లక్ష్మణ్‌కుమార్**
**కె.వి.యస్.సోమయాజి**
న్యాయవాదులు, ఏలూరు
సెల్: 9440111747